
'స్థానిక' సమరానికి కాంగ్రెస్ సై



- శ్రేణులను సన్నద్ధం చేసేందుకు నేతల సన్నాహాలు
- జడ్పీపీఠం కైవసానికి ముందస్తు వ్యూహం
- మొన్నటి లోక్‌సభ ఎన్నికలపైనా అంతర్మథనం

నిర్మల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ముందస్తుగా సిద్ధం కాబోతోంది. ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉన్న కారణంగా ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటు కోవాలని ఆ పార్టీ ఉవ్విల్లూరుతోంది. దీని కోసం గానూ పార్టీ శ్రే ణులందరిని ముందస్తుగానే సిద్ధం చేసి పకడ్బందీ వ్యూహాలను అమలు చేయాలని తలపెట్టింది. దీంతో పాటు మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన పోలింగ్ సరళీపైనే కాకుండా పార్టీకి ఎక్కడెక్కడ నష్టం జరిగిందో ననే అంశాలపైనా, వాటికి సంబంధించిన కారణాలపైనా విశ్లేషణ జరిపేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోంది. అయితే ఈ అన్ని అంశాలపై పకడ్బందీగా సమీక్షించుకునేందుకు కొద్దిరోజుల్లోనే ఆ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించుకోనుంది. ఈ సమావేశానికి జిల్లా మంత్రి సీతక్కతో పాటు మరికొంత మంది రాష్ట్రస్థాయి నాయకులు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేయబోతున్నారు. మొదటి నుంచి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ ఇక్కడి రాజకీయ పరిస్థితులతో పాటు ఎదుటి పార్టీల బలాలు, బలహీనతలను తెలుసుకున్న ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఈ సారి జిల్లాలో స్థానిక సంస్థలపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకుంటున్నట్లు చెబుతున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుతో పాటు అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. శ్రేణుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని స్థానిక ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించబోతున్నారు. కొద్దిరోజుల్లోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్న కారణంగా ప్రత్యర్థి పార్టీల కన్నా ముందుగానే సిద్ధం చేయాలన్నదే ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంటోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కారణంగా స్థానిక ఎన్నికల్లో గెలుపును ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనుందంటున్నారు.

అత్యధిక సర్పంచ్ పదవులే లక్ష్యం

కాగా జిల్లాలో అత్యధికంగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకోవడమే ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంటోంది. పార్టీలకు అతీతంగా స ర్పంచ్ ఎన్నికలు జరగనున్నప్పటికీ పరోక్షంగా మాత్రం ప్రధానపార్టీలకు సంబంధించిన మద్దతుదారులే రంగంలో ఉంటారన్నది బహిరంగ రహస్యమే. అయితే గ్రామస్థాయిలో అటు పార్టీకి గానీ ఇటు పరిపాలనకు గానీ క్రియాశీలకంగా వ్యవహరించే సర్పంచ్ పదవులకు కాంగ్రెస్ పార్టీ అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. దీనికోసం గానూ మెజారిటీ సర్పంచ్ పదవులను దక్కించుకుని తమ పట్టును నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ సారి పకడ్బందీ వ్యూహాలను అమలు చేయబోతోంది. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఈ ఎన్నికలతో చెక్‌పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంటోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు మం జూరు చేయకపోవడం, అలాగే సర్పంచ్‌లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం లాంటి అంశాలను ఈసారి కాంగ్రెస్ పార్టీ తన ప్రచారంలో వాడుకొని పైచేయి సాధించాలని భావిస్తోంది.

జడ్పీపీఠమే లక్ష్యం

ఇదిలా ఉండగా జిల్లాలో మెజారిటీ జడ్పీటీసీ స్థానాలను గెలుచుకొని ఈసారి ఎలాగైనా జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలంతా పట్టుదలతో ఉన్నారు. మొన్నటి వరకు అప్పటి అధికార బీఆర్‌ఎస్ పార్టీ జడ్పీలను నిర్లక్ష్యం చేసిన అంశాన్ని తెరపైకి తేవాలని ఆ పార్టీ భావిస్తోంది. అలాగే ప్రస్తుతం ఆ పార్టీ అధికారంలో ఉన్న కారణంగా జడ్పీపీఠం పార్టీకి ఎంతో ప్రతిష్ఠాత్మకమని ఎలాగైనా ఈ సారి ఆ పదవిని దక్కించుకుని ప్రత్యర్థి పార్టీలకు సవాలు విసిరేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ జడ్పీపీఠాన్ని దక్కించుకోకపోవడాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటోంది. జిల్లాలో స్థానిక సంస్థలకే కాకుండా సాధారణ పరిపాలనకు సైతం జడ్పీ ఛైర్మన్ పదవి ఎంతో కీలకమవుతున్న నేపథ్యంలో ఆ పదవినే లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. త్వరలో నిర్వహించబోనున్న సమీక్ష సమావేశంలో జడ్పీపీఠంపైనే ఎక్కువగా చర్చ జరగనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు గందరగోళంలో ఉండడాన్ని ఆ పార్టీ తమకు అనుకూలలంగా మలుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. బీజేపీకి కొంత మేరకు పట్టున్నప్పటికీ అధికార బలంతో జడ్పీపీఠాన్ని కైవసం చేసుకోవాలనే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంటోంది.


దిశా నిర్దేశం కోసం ప్రణాళిక

మొదటి నుంచి జిల్లాపై పట్టు సాధించిన మంత్రి సీతక్క డైరెక్షన్‌లో త్వరలో జరగబోనున్న కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో పోలైనా ఓట్లపైనే కాకుండా రాబోయే ఎన్నికల్లో గెలుపు ఎలా సాధించాలనే విషయంపై శ్రేణులకు ధీమా కల్పించడంపైనే మంత్రి సీతక్క శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు చెబుతున్నారు. శ్రేణులందరికి మనోధైర్యం కల్పించడమే కాకుండా వారి రాజకీయ భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ సీతక్క సమావేశంలో మాట్లాడనున్నారు. మొత్తానికి రాబోయే స్థానిక ఎన్నికల్లో భారీ విజయం సాధించి అటు బీజేపీ ఇటు బీఆర్‌ఎస్ పార్టీలకు ఇక రాజకీయంగా చెక్ పెట్టాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోందంటున్నారు.



సిద్ధమయిన మండపాలు

- నేడే వినాయక చవితి
- పోలీసుశాఖ భారీ బందోబస్తు
- భైంసాలో 7 సెక్టార్లు, 27 పోలీసు పికెట్ల ఏర్పాటు



భైంసా, సెప్టెంబర్ 6 : వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా ప్రజలు శనివారం జరుపుకోనున్నారు గణేష్ మండళ్లు ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. గణేష్ మండలిల ఆర్థిక స్థితిగతులననుసరించి ఒక మోస్తారు నుంచి వివిధ ఆకృతులలో ఆకర్షణీయంగా కళాకారుల చేతిలో రూపం సంతరించుకున్న గణేష్ ప్రతిమలను మండపాలలో ప్రతిష్ఠింప చేయను న్నారు. భారీ సెట్టింగ్‌లతో మండపాలను తీర్చిదిద్దారు. ఒక నాడు ప్రజలను సంఘటిత పరచడంలో గణేష్ నవరాత్రులు ఎంతగానో దోహదం చేయగా ఈనాడు కాలానుగుణంగా గణేష్ మండళ్లు ఉత్సాహంగా పోటీలు పడి మరీ ఈ వేడుకలను నిర్వహిస్తుండటం విశేషం.

మండలిల సభ్యులు ప్రతిష్ఠాపనకు అవసరమై ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసుకున్నారు. విగ్రహాల తరలింపును సైతం నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా మండలిల వద్ద ప్రతీనిత్యం పూజ కార్యక్రమాలతో పాటు రాత్రి వేళల్లో భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు.

భైంసాలోభారీ బందోబస్తు



భైంసాలో బందోబస్తును సమీక్షిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా పట్టణ పరిధిలో వినాయకచవితి వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఉండేందుకు గాను పోలీసుశాఖ భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. గతంలో చోటు చేసుకున్న వివిధ దురదృష్టకమైన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికబద్ధమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఏఎస్పీ అవినాష్‌కుమార్ నేతృత్వంలో పట్టణ సీఐ రాజారెడ్డి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలోని 26 వార్డులను 3 జోన్లుగా, 7 సెక్టారులుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలోని సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాలతో పాటు ప్రధాన కూడలీలు , ఆలయాలు, ప్రార్థన మందిరాల వద్ద మొత్తం 27 పోలీసు పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు 4 పెట్రోలింగ్ టీంలు నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నాయి. డివిజన్ పరిధిలోని పోలీసులతో పాటు రెండు బెటాలియన్లకు సంబంధించిన ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తులో పాల్గొననున్నాయి.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

భైంసా,సెప్టెంబరు 6 : పర్యావరణాన్ని రక్షించేందుకు గాను చవితి వేడుకల్లో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజిద్దామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, భైంసా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో బస్టాండ్ ఎదుట హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తే జరిగే కాలుష్య అనర్థాలను వివరించారు. వాతవరణ సమతుల్యతను కాపాడేందుకు, జల కాలుష్యాన్ని నివారించేందుకు అందరూ చవితి వేడుకల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి భారీ సంఖ్యలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. ఇందులో ఉత్సవ సమితి ప్రతినిధులు కపిల్ సిందే, తోట రాము, డా.నగేష్, విలాస్ గాదేవార్ తూమోల్ల దత్తు , బోజన్న, పట్టణ పండితులు బబ్బు మహారాజ్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్షంలోనూ ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నిరసన



వర్షంలోనూ నిల్చొని నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బాసర, సెప్టెంబరు, 6: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. మూడవరోజు శుక్రవారం సుమారు 3 వేల మంది విద్యార్థులు నిరసనల్లో పాల్గొన్నారు. చదువులకు ఆటంకం కలగకుండా సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఆందోళనలు చేపడుతున్నారు. తరగతులు ముగిసిన తర్వాత శుక్రవారం సాయంత్రం క్యాంపస్‌లో భారీ ర్యాలీ నిర్వహించి ప్రధానగేటు వద్ద బైటాయించారు. రాత్రి వరకు అక్కడే కూర్చున్నారు. తమ సమస్యలను ప్లకార్డులతో ప్రదర్శించారు. భారీగా వర్షం కురిసినా విద్యార్థులు అక్కడి నుంచి కదల్లేదు. రెండు గంటల పాటు ఆందోళన చేసిన విద్యార్థులు ఆ తర్వాత భోజన సమయానికి విరమించారు. మూడు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా ఇన్‌చార్జీ వైస్ చాన్సలర్ వెంకటరమణ కనీసం క్యాంపస్‌కు సైతం రావడం లేదని విద్యార్థులు అన్నారు. అనేక అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్న తాము మరో మార్గం లేకనే నిరసన చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. అధికారుల నుంచి స్పష్టమైన స్పందన వచ్చే వరకు విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా శాంతియుతంగా ఈ నిరసన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

రోగి ప్రాణాలు కాపాడేందుకు ఓ వైద్యుడి ప్రయత్నం

ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. చికిత్స



చించోలి(బి)లో లక్ష్మీ బంధువులతో మాట్లాడుతున్న డాక్టర్ వేదవ్యాస్

నిర్మల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాను పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో చుట్టపు చూపుగా వచ్చిన ఓ మహిళ ప్రాణాలు కాపాడేందుకు ఆ వైద్యుడు చేసిన ప్రయత్నం వెలకట్టలేనిది. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ గ్రామానికి చెందిన దేవునూరి లక్ష్మీ అనే మహిళ సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చింది. అప్పటికే ఆమె జ్వరంతో బాధపడుతున్నది. వచ్చిన మరుసటి రోజు జ్వర తీవ్రత మరింత పెరగడంతో బంధువులు గ్రామంలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. జ్వరాల సీజన్ కావడంతో సమాచారాన్ని వైద్య సిబ్బంది సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ వేదవ్యాస్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే చించోలి గ్రామానికి చేరుకొని లక్ష్మీని పరిస్థితిపై ఆరా తీశారు. పేదరికంలో ఉన్న ఆమెను వెంటనే జిల్లా కేంద్ర దవాఖానకు దగ్గరుండి తరలించారు. రక్త పరీక్షలు చేయడంతో డెంగ్యూ నిర్ధారణ అయ్యింది. ప్లేట్లెట్స్ గణనీయంగా పడిపోయి 20 వేల లోపు అయ్యాయి. లక్ష్మీ ప్రాణాపాయ స్థితిలో ఉందని గమనించి డాక్టర్ వేదవ్యాస్ స్థానికంగా ఉన్న బ్లడ్‌డోనర్స్ ఆచూకీ తీసుకున్నారు. లక్ష్మీకి అరుదుగా అవసరమయ్యే సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ అవసరం కావడంతో అలాంటి రక్తదాతల కోసం ప్రయత్నించారు. రక్తదానం సామాజిక సేవలో పేరున్న తలకొక్కుల నరహరిని సంప్రదించారు. శుక్రవారం తెల్లవారు జామున ముజీబ్ అనే యువకుడి ద్వారా రక్తదానం చేయించి సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ ఎక్కించారు. దీంతో ఇప్పుడు లక్ష్మీ కోలుకుంటున్నారు. ఒక రోగి ప్రాణాలు కాపాడేందుకు వృత్తి ధర్మంతో పాటు సామాజిక బాధ్యత తీసుకొని రెండు రోజులు శ్రమించిన డాక్టర్ వేదవ్యాస్‌ను పలువురు అభినందిస్తున్నారు. ఒక మహిళ ప్రాణాన్ని నిలబెట్టేందుకు డాక్టర్ వేదవ్యాస్ తీసుకున్న శ్రమ వెలకట్టలేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే. రాజేందర్, జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ అభినందించారు.

వినాయక చవితి వేడుకలు
శాంతియుత వాతావరణంలో నిర్వహించండి

సమన్వయంతో పని చేయాలని మంత్రి సీతక్క టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదేశం



నిర్మల్, సెప్టెంబరు 6 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వినాయక చవితి వేడుకలు అధికారులు శాంతియుతంగా సమన్వయంతో నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్లు, ఎస్పీలతో, అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఏర్పాట్లను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఇబ్బందులు కలుగ కుండా చూడాలన్నారు. శాంతి విఘాతాలకు భంగం కలిగిస్తే ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. అన్ని మతాల విశ్వాసాలు గౌరవిస్తూ వారి హక్కులను ప్రభుత్వం కాపాడుతుందన్నారు. ప్రజలను రెచ్చగొట్టే శక్తులపై కఠినంగా ఉంటామని తెలిపారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠ మొదలు నిమజ్జనం వరకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. 100 నెంబర్‌కు వచ్చే కాల్స్‌పై వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాల పైన నిఘా పెంచాలన్నారు. భక్తిశ్రద్ధలతో ప్రజలు పర్వదినాన్ని జరుపుకోవాలని కోరారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు సత్వరం పూర్తి చేయండి

కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబరు 6 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు. ధరణి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల వివరాలు సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల హద్దులు గుర్తించి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ 27, 28లలో భాగంగా మండలాల వారీగా భూసేకరణ పనులను వేగవంతం చేయా లని ఆదేశాలిచ్చారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, నీటి పారుదలశాఖ ఎస్‌ఈ లక్ష్మీ, ఈడీఎం నదీం, తదితరులు హాజరయ్యారు.

శానిటేషన్ పనులను
తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్, సెప్టెంబరు 6 : నిర్మల్ పట్టణ కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఉదయం 5:30 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త బస్టాండ్, బ్రహ్మంగారి గుడి, మంచిర్యాల చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించారు. వారు చేస్తున్న పనుల వివరాలు వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువలు, చెత్తా చెదారం ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. జీపీఎస్ ట్రాకింగ్‌తో ఆయన పనుల వివరాలు తెలుసుకున్నారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, తదితర సిబ్బంది ఆ ప్రాంతాల్లో ఉన్నారు.

హెచ్‌ఐవీ నివారణపై అప్రమత్తత అవసరం

- సెక్టోరియల్ అధికారి పద్మ

నిర్మల్, సెప్టెంబరు 6 : హెచ్‌ఐవీ ఎయిడ్స్ నివారణ పట్ల అప్రమత్తంగా ఉంటేనే వ్యాప్తిని అడ్డుకోవచ్చని జిల్లా పరీక్షల విభాగం సెక్టోరియల్ అధికారిని పద్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ నిర్ధారణ, నివారణ మార్గాలను వివరించారు. గ్రామీణ సపోర్టు ఫౌండేషన్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయుడు సంతోష్, హేమలత, రాజేందర్, శ్రీనివాస్, సురేందర్, ఆశాకిరణ్, సునీత, మసుద్దీన్, సత్తయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలని ఆశావర్కర్ల వినతి



నిర్మల్ టౌన్, సెప్టెంబరు 6 : కనీసవేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని శుక్రవారం డీఎంహెచ్‌వో రాజేందర్‌కు ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌వీ రమణ, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సీఐటీయూ అధ్యక్షులు పి. గంగామణి, జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, జిల్లా కోశాధికారి శ్రామిక మహిళా కన్వీనర్ బి. లలిత తదితరులు పాల్గొన్నారు.

చైతన్యయాత్ర జయప్రదం చేయాలి

నిర్మల్, సెప్టెంబరు 6 : ఉద్యమకారుల చైతన్యయాత్ర జయప్రదం చేయాలని ఫోరం తీర్మానిం చింది. శుక్రవారం టీఎన్జీవో సంఘ భవనంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు కొట్టే శేఖర్ మాట్లాడుతూ... సోమవారం చైతన్య యాత్ర నిర్మల్‌లో జరుగనుందన్నారు. ఉద్యమ బిడ్డ జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మృతికి సంతా పం ప్రకటించారు. శంకర్, అజయ్, కామారపు జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి పరామర్శ

నిర్మల్, సెప్టెంబరు 6 : సోన్ మాజీ జడ్పీటీసీ జీవన్‌రెడ్డిని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు.

బాధిత కుటుంబానికి గ్రామస్తుల ఆర్థిక సహాయం

సిరికొండ రూరల్, సెప్టెంబరు6: ఇటీ వల సిరికొండ గ్రామపంచాయతీ పారి శుధ్య కార్మికుడు దాసరి శ్రీనివాస్ మూర్ఛవ్యాధితో ప్రమాద వశాత్తు నీటికుంటలో పడి మృతిచెం దాడు. గత రెండునెలల క్రితం శ్రీనివాస్ భార్య దాసరి రజిత కుటుం బసమస్యలతో పురుగుల మందు తాగి మృతిచెం దడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథ లుగా మారారు. దీంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో మృతుడి అంత్యక్రియలకు గ్రామంలో విరాళాలు సేకరించి శుక్రవారం రూ.42 వేలను బాదిత కుటుంబానికి అందజేశారు. అలాగే "మన ఆపద్బాంధవులు ఫౌండేషన్" హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బాదిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఒరగంటి పెంటన్న, షేక్ రంజాన్, తోకల చిన్నరాజన్న, బియ్యాల మల్లేష్, బొడ్డు దత్తు, ఒరగంటి విజయ్, షేక్ ఆలం, కంచం లక్ష్మణ్, ఎగ్గిడి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో పేకాట రాయుళ్ల అరెస్టు

- ఆరుగురిని అదుపులో తీసుకున్న పోలీసులు
- రూ.2.28 లక్షల నగదు స్వాధీనం

ఆదిలాబాద్, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేం ద్రంలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఓ ఇంటిపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేసి పలువురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. టూ టౌన్ సీఐ కరుణా కర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని విద్యానగర్ కాలనీకి ఓ వైన్స్ యజమాని ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు తెసీఐ తెలిపారు. ఇందులో వినోద్‌రెడ్డి, పాషా, నాగనాథ్, రమణ, దేవన్న, అశోక్‌లు ఉన్నట్లు తెలిపారు. అయితే పట్టుబడిన వారిలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలు స్తోంది. వారి నుంచి రూ.2 లక్షల 28 వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు న మోదు చేసినట్లు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షున్ని కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన టీపీ సీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వ కంగా కలిసి శాలువాతో సన్మానించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ నాయక త్వంలో రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామన్నారు. పార్టీ మరింత పటిష్టమవుతుందని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షునిగా మహేశ్‌కు మార్‌గౌడ్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బడుగు బల హీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యతనిస్తుందని దీనికి నిదర్శనమే టీపీసీసీ అధ్యక్షుని నియామకమన్నారు. ఆయన నాయకత్వంలో పని చే సేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని బలపడేలా కృషి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కంది

'రజకులకు ఇబ్బందులు కలగకుండా దోబీ ఘాట్ నిర్మిస్తాం'

బోథ్, సెప్టెంబరు 6 : బోథ్ మండల కేంద్రానికి చెందిన రజక కులానికి చెందిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రజకులకు తాము బట్టలు ఉతికేందుకు పడుతున్న ఇబ్బం దులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దోబీఘాట్ లేకపోవడం వల్ల మృతి చెందడం జరిగిందని తమకు దోబీఘాట్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని రజకులు డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే దోబీఘాట్ నిర్మాణాని చేపడుతామని రజకులకు హామీనిచ్చారు. అంతేగాక మృతురాలి అంత్యక్రియలకకు తనవంతుగా పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. పెద్ద వాగు వద్ద దోబీఘాట్‌తో పాటు బతుకమ్మ ఘాట్లను నిర్మించడం జరుగుతుందన్నారు. నీటి ఉధృతి తగ్గగానే వీటిని నిర్మాణంపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆసుపత్రిని తనిఖీ చేశారు. రోగులు దగ్గరికి వెళ్లి వైద్యం అందుతుందని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో వ్యాధులను అరికట్టేందుకు గాను వైద్యం సకాలంలో అందించాలని డాక్టర్ రవీంద్ర ప్రసాద్ సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ఆయన వెంట నేరడిగొండ మండల నాయకులు రవీందర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డితో పాటు కౌటా(బి) గ్రామ నాయకులు డాక్టర్ స్వామి, సోనాల మాజీ సర్పంచ్ సి.సదానందం, మాజీ కో ఆప్షన్ సభ్యులు తాహెర్‌బీన్ సలాం, గుర్రాల తండా మాజీ సర్పంచ్ సాకరంతో పాటు పలు గ్రామాల నాయకులు ఉన్నారు.

మట్టి గణపతుల పంపిణీ

తలమడుగు, సెప్టెంబరు 6: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తలమడుగు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, పర్యావరణ కాలుష్య నివారణ కోసం మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి గణపతులు పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ సంఘటనపై ఆదివాసీల నిరసన

బోథ్, సెప్టెంబరు 6 : ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసి హత్యకు కుట్ర పన్నిన వ్యక్తిని వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ సోనాల మండల కేంద్రంలో ఆదివాసీలు కొమురం భీం విగ్రహం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఐటీడీఏ డైరెక్టర్ మిశ్రమ భూమన్న ఆధ్వర్యంలో పార్టీ బి రాయి సెంటర్ వారు చేపట్టిన నిరసన కార్యక్రమానికి సార్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మారుతి, కిషన్, మిశ్రమ భూమన్న, భవగవాన్లతో పాటు ఉపసార్పెడి మెస్రం లాలూరం లోకేష్, నగేష్ మహాజన్, పురుషోత్తం, ప్రతాప్‌సింగ్, రోహిదాసు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ నుంచి నిధులు రికవరీ చేయాలి

బోథ్, సెప్టెంబరు 6 : బోథ్ సహకార సంఘం చైర్మన్‌గా విధులు నిర్వహించడంలో విఫలమై రైతులకు అన్యాయం చేసిన సస్పెండ్ అయిన చైర్మన్‌కు చెల్లించిన వేతనంతో పాటు వివిధ రకాల అలవెన్స్‌లను తిరిగి ప్రభుత్వం రాబట్టాలని సహకార సంఘం డైరెక్టర్లు జి.రాజు యాదవ్, చెట్ల ఉమేష్, పోశెట్టి, కె.నారాయణలు డిమాండ్‌చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సరైన సమావేశాలు జరపకుండానే విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన చైర్మన్‌ను ప్రభుత్వ అధికారులు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. విధులు నిర్వహించకుండా వేతనాలు తీసుకున్న ఈయన నుంచి నెల నెల పొందిన వేతనంతో పాటు వివిధ అలవెన్స్‌లను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే

బోథ్, సెప్టెంబరు 6 : బోథ్ మండల కేంద్రానికి చెందిన దళిత మహిళ రాజమణి (50) సంవత్సరాలు ఆమె భిక్షాటన చేస్తూ జీవిస్తున్న ఒక్కగానొక్క కూతురిని పెళ్లి చేసి ఐదు సంవత్సరాల క్రితం అత్తారింటికి పంపింది. ఒంటరిగా నివసిస్తున్న ఈమె తన ఇంటిలో అనారోగ్యం కారణంగా మృతి చెందింది. ఇంటిలో ఏకాకిగా నివసించే ఈమె ఎప్పుడు ఎవరికి తెలియలేదు. శుక్రవారం ఉదయం కాలనీ వాసులు ఇంటికి వేసి ఉన్న తలుపులను తెరవగా మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె మృతికి గల కారణాలు తెలుసుకుని అంత్యక్రియలకు రూ.5 వేలు అందజేసి అండగా నిలిచారు.

బీజేపీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో నిరసన

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు6: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు ధోని జ్యోతి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తూ మహిళ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు6: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి రైతువేదికలో మండల అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో వనజ మాట్లాడుతూ పోషకాహారంతోపాటు అంగన్‌వాడీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆకు కూరలు, పప్పు దినుసులు వంటి ఆహార పదార్థాలు తీసుకున్నట్లయితే పోషకాహారం లోపం కలగకుండా గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మండలాధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు6: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. పోటీలను ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావ్‌తో కలిసి పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సంగీత ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూరితో ఆడాలన్నారు. మంచి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యేలా క్రీడాకారులు పట్టుదలతో కృషి చేయాలన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా


ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 06 : జిల్లా అధికారులు శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలని చూడాలని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా దిశా నిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రులను నిర్వహించాలని, విగ్రహాల ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. తప్పుడు ప్రచారం చేసే సోషల్ మీడియా మీద నిఘా పెంచాలని, సోషల్ మీడియాలో వచ్చే అపోహలను నమ్మొద్దని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా, అనదపు కలెక్టర్ శ్యామల దేవి, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జైనూర్‌లో జరిగిన ఘటన శోచనీయం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 06 : జైనూర్‌లో జరిగిన ఘటన శోచనీయమని, ఆ ఘటనపై మత రాజకీయాలకు చిత్రీకరించాడన్ని తుడుందెబ్బ జిల్లా కన్వీనర్ వెట్టి మనోజ్ ఖండించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ సంఘం సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంత మంది రాజకీయ నాయకులు జైనూర్ ఘటనపై రాజకీయం చేయడం సరికాదని, ఘటన స్థలాలకు వచ్చివాస్తవాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆవేశంలో ఆదివాసులు చేసిన ఘటన తప్ప మరొకటి లేదన్నారు. సమావేశంలో తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

తాంసి మండలంలో భారీ వర్షం

తాంసి రూరల్, సెప్టెంబరు 6 : మండలంలో మళ్ళీ శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట పాటు కురిసిన ఈ వర్షానికి వాగులు పొంగి పొర్లాయి. మత్తడివాగు ప్రాజెక్టులోకి భారీ వరద నీరు వచ్చి చేరుతుంది. దినంలో ఎండ కొట్టడంతో ఇక వర్షం శాంతించిందని అన్నదాతలు అనుకున్నారు. కాని మళ్ళీ వర్షం కురవడంతో పంట పొలాల్లో సైతం వర్షపు నీరు చేరి పంటలకు నష్టం వాటిల్లేలా తయారైందని రైతులు అంటున్నారు.


పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న అదనపు డీజీ

ఇచ్చోడలో ముమ్మర తనిఖీలు

ఇచ్చోడ, సెప్టెంబరు6: జైనూర్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. అడుగడుగున పికెటింగ్ పాయింట్లను ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తున్నారు. ఎవరూ కూడా గుంపులుగా ఉండకుండా 144సెక్షన్ విధించారు. రాష్ట్ర అదనపు డీజీ మహేష్ భగవత్, అదనపు ఎస్పీ సురేందర్‌రావ్, ఎస్పీ గౌస్ అలం పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. దాదాపు 150మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తును నిర్వహించారు. అనంతరం ఇచ్చోడ మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. శుక్రవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఇచ్చోడ బంద్‌కు అన్నిరకాల సంఘాలు, వాణిజ్య, వ్యాపారస్థులు బంద్‌కు సహకరించాయి. దీంతో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. కార్యక్రమంలో సీఐలు భీమేష్, చంద్రశేఖర్, నవీన్, ఎస్సైలు నరేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే మంచివి

బోథ్, సెప్టెంబరు6: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని కోరుతూ మండలకేంద్రంలోని వేదం పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో రసాయనాలతో కూడిన రంగుల వినాయకుడిని పూజించి నీటిలో నిమజ్జనం చేస్తే నీటికాలుష్యం ఏర్పడుతుందని ప్రిన్సిపాల్ సంతోష్ విద్యార్థులకు వివరించారు. పలువురు విద్యార్థులు వినాయకుని వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు వ్యాసరచన ఉపన్యాస పోటీలలో పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

భీంపూర్ రూరల్, సెప్టెంబరు6: మండలంలోని గర్భిణీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇచ్చే పలు జాగ్రత్తలు తీసుకోవాలని భీంపూర్ తహసీల్దార్ సత్యనారాయణరావు అన్నారు. ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షేక్ ముంతాజ్, రాధ, మండల మెడికల్ అధికారిలతో కలిసి మండల కేంద్రంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల మండల అధ్యక్షురాలు ధోని పెల్లి వెంకటమ్మ, అంగన్‌వాడీలు ప్రియ, సీడం సునీత, రింగని సునీత, లక్ష్మీ, నజీమ, ముక్త తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు6: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్, కామర్స్)లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 1, ఎకనామిక్స్, ఉర్దూ మీడియం సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయని, అభ్యర్థులు సంబంధిత పీజీలో 55 శాతం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులున్న వారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలు అందజేస్తే వెయిటేజీ ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో ఈనెల 9వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, 10న జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తివివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

పారిశుధ్యం పనులు సత్వరమే పూర్తి చేయాలి

● ఎంపీడీవో జీవన్‌రెడ్డి

బోథ్, సెప్టెంబరు6: పారిశుధ్య పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీవో జీవన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం పనులను రోజురోజుకు పరిశీలించాలని నీరు నిల్వఉండకుండా చూడాలని సూచించారు. ప్రజలకు సైతం తమ ఇండ్ల చుట్టూ నీరు నిల్వకుండా చూసుకుని దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

పంటనష్టంపై సర్వేను వేగవంతం చేయాలి

● దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టండి: కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పంటలకు జరిగిన నష్టంపై సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధిలోని మర్కగూడ, వడ్‌గావ్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడ, హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్‌టేకిడి గ్రామాల్లో పర్యటించి భారీ వర్షానికి కోతకు గురైన వంతెనలు, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను, వంతెనలు, పనులను వేగంగా పూర్తి చేస్తామన్నారు. దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీరాజ్ డీఈ పవార్ రమేష్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా మండలవ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్‌తో పాటు కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. వర్షంతో పంటలకు జరిగిన నష్టంపై సర్వేనువేగవంతం చేయాలని ఆదేశించారు. ఈనెల 10 లోగా సర్వే పూర్తి చేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పంట నష్టంపై సర్వేని పకడ్బందీగా నిర్వహించి పంట నష్టపోయిన ప్రతీ రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం లాల్‌టేకిడి గ్రామంలో గ్రామస్థులు పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పాఠశాలను సందర్శించి పాఠశాల భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ సాయన్న, పంచాయతీ రాజ్ ఈఈ శివరామ్, డీఈ పవార్ రమేష్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కోతకు గురైన వంతెనలు, రోడ్లను పరిశీలించిన కలెక్టర్ రాజర్షిషా

వాగులో పడి వృద్ధురాలి మృతి

బోథ్, సెప్టెంబరు6: మండల కేంద్రానికి చెందిన రజక మహిళ వడ్నాల పోసాని (55) శుక్రవారం ఉదయం బట్టలు ఉతికేందుకు సమీపంలోని వాగు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందింది. బోథ్ ఎస్సై ప్రవీణ్ తెలిపిన ప్రకారం.. పోసాని ఉదయం తనవృత్తిలో భాగంగా బట్టల మూటను తీసుకుని వాగులో దిగింది. బట్టలు ఉతుకుతుండగా చేతిలో నుంచి చీర జారిపోవడంతో నీటిలో కొట్టుకుపోతున్న చీరను పట్టుకునేందుకు ముందుకు వెళ్లగా జారిపడి మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు సమాచారం అందించడంతో పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా అందించాలి

బోథ్, సెప్టెంబరు6: మధ్యాహ్న భోజనం విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, భోజనాన్ని రుచిగా అందించాలని మండల విద్యాధికారి భూమారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఉన్న హరిజనవాడ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనా న్ని శుభ్రంగా, రుచిగా ఇవ్వాలని అన్నారు. అన్నంలో పురుగులు రా కుండా చూడాలని సూచించారు. ఈ విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షులు గాజుల సురేందర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు6: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ సూచించారు. ఆదిలాబాద్‌లోని వార్డ్ నెంబర్.48, 49లోని కాలనీల్లో డ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ దోమలు వృద్ధి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మెప్మా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ సహకార సంఘం చైర్మన్‌పై సస్పెన్షన్ వేటు

బోథ్, సెప్టెంబరు6: బోథ్ మండల సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన కదం ప్రశాంత్‌ను సస్పెండ్ చేస్తూ సహకార సంఘం జిల్లా అధికారి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పొచ్చెరా గ్రామానికి చెందిన డైరెక్టర్ కోల రాజేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించడం జరిగింది. కాగా సహకార సంఘం చైర్మన్ సస్పెన్షన్ వ్యవహారం ఆసక్తికరంగా మారింది. సహకార సంఘం డైరెక్టర్లు పట్టు వదలకుండా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు వచ్చినట్లు తెలుస్తోంది. రాజకీయపరంగా అనుభవంఉన్న రాజుయాదవ్ సస్పెన్షన్ వ్యవహారం పూర్తయ్యేంతవరకు డైరెక్టర్లతో కలిసి కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేయించి సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది.

నిరీక్షణ గదులకు చేరుకుంటున్న గర్భిణులు

ఉట్నూర్, సెప్టెంబరు 6: గ్రామీణ గిరిజన ప్రాంతాలకు చెందిన గర్భిణీలను వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిరీక్షణ గదులకు తరలిస్తోంది. ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రి వద్ద జాతీయ ఆరోగ్యమిషన్ ఆధ్వర్యంలో 10 పడకల ప్రసవ నిరీక్షణ గదులను ఐటీడీఏ ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాటుచేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన గర్భిణీలకు 3నెలల కాలం నుంచి 9నెలల వరకు వైద్యసిబ్బంది తర చూ పర్యటిస్తూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు కావాల్సిన వైద్యసేవలను అందిస్తూ వస్తున్నారు. ప్రసవ సమయం గుర్తించి 3 లేదా 5రోజుల ముందు నుంచి గర్భిణీలను ఉట్నూర్‌లోని ప్రసవ నిరీక్షణ గదులకు తరలించి సుఖప్రసవాలు నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిసా, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు ఏజెనీస వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడిమెత మనోహర్ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది ఉట్నూర్‌లోని ప్రసవ నిరీక్షన గదులలో గర్భిణీలను చేర్పించి సుఖప్రసవాలు జరిగేలా చర్యలు ప్రారంభించారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన అమ్ముబాయిని బీర్‌సాయిపేట్ సెంటర్ ఏఎన్‌ఎం ఎల్లవ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ఉట్నూర్‌లోని ప్రసవ నిరీక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. ఈమెతో పాటు మడావి అనురాధాను కూడా తీసుకువచ్చి అడ్మిట్ చేశారు. శుక్రవారం హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాట కూడాకు చెందిన జంగుబాయిని, రాజుల మడుగుకు చెందిన మడావి భీమ్‌బాయిని వైద్య సిబ్బంది తీసుకు రావడంతో ప్రసవ నిరీక్షణ గదిలో చేర్పివారికి కావల్సిన మందులు అందించినట్లు సూపర్‌వైజర్లు శిరీష్‌కుమార్, శ్రీనివాస్ తెలిపారు.


నిరీక్షణ గదిలో గర్భిణీ జంగు


ఆదివాసీ పటేళ్లు, దేవరీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదివాసీ యువతను హింసాత్మక ఘటనలకు దూరంగా ఉంచాలి

● ఆదివాసీ పటేళ్లతో సమావేశంలో ఎమ్మెల్యే

ఉట్నూర్, సెప్టెంబరు6: ఆదివాసీ యువతను మంచిమార్గం వైపు నడిపించేలా గ్రామపటేళ్లు కృషిచేయాలని ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారంరాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల పటేళ్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్‌లో జరిగిన హింసాత్మక ఘటన చాలా బాధాకరమన్నారు. ఏజెన్సీప్రాంతంలో కొందరు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివాసీ యువతను మచ్చిక చేసుకుని వారిని ఉసగొల్పి కటకటాలపాటు చేసే కుట్ర పన్నుతున్నారని అన్నారు. ఆదివాసీ యువత ఎవరిమాటలు వినవద్దని కోరారు. గ్రామాల పటేళ్లు వారిపై శ్రద్ధచూపి సరైన మార్గంలో వెళ్లేలా దిశానిర్దేశం చేయాలని సూచించారు. ఆదివాసీలు సంయమనం పాటించాలని కోరారు. రైతు రుణమాఫీ కాని వారందరూ ఎటువంటి ఆందోళన చెందవద్దని, ప్రతీ రైతుకు రుణమాఫీ అవుతుందని అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పటేళ్ళు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో పోలీసు కవాతు

● కొనసాగుతున్న తనిఖీలు

ఉట్నూర్, సెప్టెంబరు6: ఉమ్మడి జిల్లాలోని జైనూర్ హింసాత్మక సంఘటనల అనంతరం ప్రజల్లో భయాందోళనలు తొలగించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉట్నూర్ పట్టణంలో 200మంది పోలీసులు పట్టణంలో కవాతు నిర్వహించారు. జైనూర్‌లోని ఒకవర్గం ప్రార్థన స్థలాన్ని ధ్వంసం చేశారని పేర్కొంటూ గురువారం సాయంత్రం కొందరు ఒక వర్గానికి చెందిన యువకులు మందుకు పిలునివ్వడంతో 144సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరు ఎలాంటి బంద్‌లు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడానికి వీలు లేదని పోలీసులు సూచించడంతో బంద్‌ను విరమించుకున్నారు. అయినప్పటికి శుక్రవారం కొందరు తమ వ్యాపార సంస్థలను మూసివేశారు. ప్రజలెవరూ అధైర్య పడొద్దని, పోలీసులు ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉన్నారని పేర్కొంటూ ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో 200మంది పోలీసులు, పోలీసు అధికారులు ఉట్నూర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 200మంది పోలీసులతో ప్రజల రక్షణ చర్యలు తీసుకున్నామని, సామాజిక మాధ్యమాలలో వచ్చి తప్పుడు సమాచారాలు విని ప్రజలు అధైర్యపడవద్దని సూచించారు. ఇదిలా ఉండగా ఉట్నూర్ మండలంలోని లింగోజి తాండ చౌరస్తా నుంచి హస్నాపూర్, పూసిగూడవ వరకు పోలీసులు తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆసిఫాబాద్ జిల్ల వైపు ఎలాంటి వాహనాలను అనుమతించడం లేదు. నార్నూర్ మండలం గుండ కొందరు ఆసిఫాబాద్ ప్రాంతానికి చేరుకుంటున్నట్లు తెలుస్తుంది. జైనూర్ ప్రాంతంలో ఇంటర్‌నెట్ సేవలతోపాటు, రవాణా సేవలు కూడా దూరం కావడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


ఉట్నూర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 6 : నూతన పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీలలో మస్కాపూర్ విద్యార్థికి రజత పతకం


వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రజత పతకం సాధించిన నిశిత వర్ధినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఖానాపూర్, సెప్టెంబరు 6 : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇటీవల మూడు రోజులపాటు నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీలలో మస్కాపూర్ గ్రామానికి చెందిన తునికి నిశిత వర్ధిని రజత పతకం సాధించింది. పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు పాల్గొనగా 64 కేజీల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని నిశిత వర్ధిని ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం సాధించినట్లు పాఠశాల పీడీ షేక్ ఇమ్రాన్ తెలిపారు. రజత పతకం సాధించిన నిశిత వర్ధినిని శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, ఉపాధ్యాయులు శంకర్, శేఖర్, శ్రీనివాస్, అంజయ్య, శోభారాణి, దీప్తి, స్వప్న, గంగాధర్, రమేష్, రజిత, ప్రకాష్, మారుతి, సాయికిరణ్, ఝాన్సీ, సృజన, వందన, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కుంటాల, సెప్టెంబరు, 6 : మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో గ్రామానికి చెందిన సంబారు ఎంకవ్వ (94) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై భాస్కరాచారి, కుటుంబీకుల కథనం మేరకు ఎంకవ్వ రాత్రి వేళ కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో భైంసా నుండి నిర్మల్ వైపు వెళుతున్న బులోరా వాహనం టీజీ 18 టీ 0139 అతివేగంగా ఈమెను ఢీకొంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. వృద్ధురాలని 108 సహాయంతో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతురాలి మనుమడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'వ్యవసాయ అధికారులను కేటాయించాలి'


ముథోల్, సెప్టెంబరు 6 : హైదరాబాద్‌లోని మహాత్మజ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి ప్రోగ్రాంలో ముథోల్ మండల ఏవో, ఏఈవో పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని శుక్రవారం ముథోల్ మాజీ సర్పంచ్ రాజేందర్ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. తాలూకా కేంద్రంలో వ్యవసాయ అధికారులు లేక రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే నాధుడు కరువయ్యారని వినతిపత్రంలో పేర్కొన్నారు రైతు రుణమాఫీ వివరాలు ఇతరత్రా సమస్యలకు రైతు వేదికలో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారులు ట్రాన్స్‌ఫర్ అయ్యి ఇప్పుడు ఎవరు లేకపోవడంతో రైతులు సమాచారం లేక అయోమయానికి గురవుతున్నారన్నారు.

వరద బాధితుల సాయానికి.. నేను సైతం

● కిడ్డీబ్యాంక్‌లో దాచుకున్న డబ్బులు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళం ● ఫోన్‌పే ద్వారా రాష్ట్రాల సీఎం రిలీఫ్‌ఫండ్ ఖాతాలకు బదిలీ


దాచుకున్న డబ్బులుతో శన్వికా


ఇలా పగలగొట్టి డబ్బుల లెక్కింపు



తెలంగాణ సీఎంఆర్‌ఎఫ్‌కు రూ. 2,000లను ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన దృశ్యం

ఖానాపూర్, సెప్టెంబరు 6 : ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి ప్రకోపానికి విలవిలలాడుతున్న బాధితులకు ఎందరో మంది దాతలు చేయూతను అందిస్తున్నారు. సాయం చేసేందుకు వయసుతో పని లేదని గొప్ప మనసుంటే చాలని నిరూపించింది. చిన్నారి... ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన శివరామకృష్ణ, సోనీతాయి దంపతుల కూతురు శన్వికా ఒకటో తరగతి చదువుతోంది. తనకు తల్లిదండ్రులతో పాటు బంధువులు ఇచ్చిన డబ్బులను కిడ్డీబ్యాంక్‌లో దాచుకోవడం అలవర్చుకుంది. కాగా ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అల్లాడుతున్న వార్తలను టీవీలలో చూసి చలించిపోయిన చిన్నారి శన్వికా తన కిడ్డీబ్యాంక్‌లో డబ్బులను వరద బాధితులకు ఇవ్వాలని తన తండ్రి శివరామకృష్ణను కోరింది. దీంతో ఆనందించిన తల్లిదండ్రులు కిడ్డీబ్యాంక్‌ను తెరిచి చూడగా అందులో రూ. 3,500ల డబ్బులు ఉన్నాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వానికి రూ. 2,000, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ. 1,500లను ఫోన్ పే ద్వారా పంపినట్లు శన్వికా తండ్రి శివరామకృష్ణ తెలిపారు. చిన్నారి శన్వికా ఆలోచన చూసి ఆమెను పలువురు అభినందిస్తున్నారు.


ఏపీ సెక్రటరీయేట్‌కు రూ. 1,500

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

● ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీలో నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్, సెప్టెంబరు 6 : ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెల్మల్ బొప్పారంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. వర్షాలు అధికంగా కురవడం వల్ల వైరల్ జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నందున వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని, అధికంగా జ్వరాలు ఉన్న గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్, వైద్యులు డాక్టర్ శ్యామ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారి


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పఠనాసక్తిపై విద్యార్థులకు అవగాహన

నిర్మల్ సెప్టెంబరు 9 : మొబైల్ పుస్తక వాహనం ద్వారా రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సోన్ మండలం జాఫ్రాపూర్ పాఠశాల విద్యార్థులకు పఠనాసక్తిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మల్ కలెక్టర్ చొరవతో సింగల్ డోనల్ ప్లేట్లెట్ మిషన్ అందుబాటులోకి

నిర్మల్, సెప్టెంబరు 6 : జిల్లా జనరల్ ఆసుపత్రిలో సింగిల్ డోనల్ ప్లేట్లెట్ మిషన్ అందుబాటులోకి వచ్చినట్టు సూపరిండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ చొరవతో ఈ మిషన్ అందుబాటులోకి వచ్చినట్టు తెలిపారు. ఇన్ పేషెంట్ అడ్మిట్ అయిన వారికి ఎస్‌డీపీ డోనర్లు అందుబాటులో ఉంటే ఆసుపత్రిలో ఉచితంగా ప్లేట్లెట్స్ ఎక్కించబడుతుందన్నారు. ప్రైవేట్‌లో ప్లేట్లెట్లు ఎక్కించుకుంటే అయ్యే 15 వేల రూపాయలు ఆదా అవుతాయని ప్రభుత్వం సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఇటీవల ఓ మహిళలకు జనరల్ ఆసుపత్రిలో ప్లేట్లెట్లు ఎక్కించినట్టు తెలిపారు.

తప్పుల సవరణకు వర్క్‌షాప్

నిర్మల్, సెప్టెంబరు 6 : తొమ్మిదో తరగతి సైన్స్ పుస్తకాల ముద్రణలో తప్పులు సవరించేందుకు గాను శుక్రవారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఎస్‌ఈఆర్‌టీ ఆదేశాల ప్రకారం రసాయన, జీవ, భౌతిక శాస్త్రాల్లో పుస్తకాల్లో తప్పుల సవరణకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ వర్క్‌షాప్ డీఈవో రవీందర్‌రెడ్డి సందర్శించి లోపాలు గుర్తించి సరైన పుస్తక నిర్మాణంలో పాలుపంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్వాలిటీ కోఆర్డినేటర్ నర్సయ్య, సిద్ధ పద్మ, సైన్స్ అధికారి వినోద్ కుమార్, సైన్స్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

● ధర్నాలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు రజిని


ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా

నిర్మల్, సెప్టెంబరు 6 : కొమురం భీం జిల్లా జైనూర్‌లో గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రజిని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం గిరిజన మహిళలకు న్యాయం చేయాలంటూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఆర్డీవో రత్న కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. నిందితుడికి బహిరంగంగా ఉరి తీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అలివేలు మంగ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డయల్ 100కి ఫోన్ చేసిన వ్యక్తికి జైలు



ఖానాపూర్, సెప్టెంబరు 6 : మద్యం మత్తులో డయల్ 100కి ఫోన్ చేసి పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేసిన వ్యక్తికి జైలు శిక్ష పడిన ఘటన ఖానాపూర్ మండలంలోని రామ్‌రెడ్డి పల్లె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ సీఐ సైదారావు తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని రామ్‌రెడ్డి పల్లె గ్రామానికి చెందిన శివరాత్రి లక్ష్మణ్ అనే వ్యక్తి ఈ నెల 5వ తేదీన మద్యం మత్తులో డయల్ 100 నెంబర్‌కు పలుమార్లు ఫోన్ చేసినట్లు తెలిపారు. దీంతో పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేసిన కారణంగా లక్ష్మణ్‌పై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రిలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8 । కనిష్ఠం 25.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 7 సెప్టెంబరు 2024



» జిల్లాలో 1012.3 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం
» భారీ వర్షాలు, వరదలతో దెబ్బతింటున్న పత్తి పంట
» చుట్టుముడుతున్న చీడపీడలు, దిగుబడులపై ప్రభావం
» పూత కాత నేల రాలడంతో అన్నదాతల ఆందోళన

పత్తికి గండమే!



• తలమడుగులో నేలమట్టమైన పత్తి పంట



• జైనథ్ మండలంలో నీటమునిగి కుళ్లిపోయిన పత్తి పంట

ఆదిలాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వారం రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలకు అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వర్షాలు, వరదల కారణంగా వందల ఎకరాలలో పత్తిపంట నీట మునిగింది. జిల్లావ్యాప్తంగా 2వేల ఎకరాలలో పంటనష్టం జరుగగా ఇందులో అధికంగా 1560 ఎకరాలలో పత్తి పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఉన్న కాస్త పంటనైనా కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఈ యేడు 4లక్షల ఎకరాలకు పైగా పత్తి పంట సాగయ్యింది. ఎడతెరిపి లేకుండా ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పంటపై తీవ్ర ప్రభావం పడుతుందని చెబుతున్నారు. ప్రస్థుతం పూత, కాత దశలో ఉన్న పత్తి అధిక తేమతో నేలరాలి పోతుందని రైతులు వాపోతున్నారు. ఈ యేడు జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 869.7 మి.మీలు కాగా ఇప్పటి వరకు 1012.3 మి.మీల అధిక వర్షపాతం కురిసింది. పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోని మండలాలైనా జైనథ్, బేల, భీంపూర్, తాంసి తదితర మండలాల్లో నది బ్యాక్ వాటర్ పంటలను ముంచెత్తింది. దీంతో రోజుల తరబడి వరద నీటిలోనే ఉండిపోవడంతో పత్తి మొక్కలు కుళ్లిపోయి వందల ఎకరాలు నేలమట్టమైంది. గత నాలుగైదేళ్లుగా మద్దతును మించిన ధర పలుకడంతో పత్తి వైపే రైతులు మొగ్గుచూపారు. దీంతో సాగువిస్తీర్ణం ఘననీయంగా పెరిగింది. అయితే ఇవేపరిస్థితులు మరికొన్నాళ్లపాటు ఉంటే పంట చేతికిరావడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

• అధిక తేమతో నష్టం

జిల్లాలో 1012.3 మి.మీల అధిక వర్షపాతం నమోదైంది. దీంతో అధిక తేమ కారణంగా పత్తి పంట ఎదుగుదల నిలిచి ఎరుపు భారీ పోతుందని రైతులు వాపోతున్నారు. అత్యధికంగా ఆదిలాబాద్‌అర్బన్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్‌రూరల్, తాంసి, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లో వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలో నల్లరేగడి నేలలే అధికంగా ఉన్నాయి. కురుస్తున్న భారీ వర్షాలకు నల్లరేగడి నేలల్లో అధిక తేమ కారణంగా పంట భూములు జౌకుభారీ పోతున్నాయి. అలాగే కలుపు నివారణ సాధ్యం కాక పోవడంతో పత్తి పంటను కలుపుమొక్కలు కప్పేస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట చేన్లలో కాలు తీసి కాలు వేసే పరిస్థితి కనిపించడం లేదు. ఎర్రరేగడి నేలల్లో పంట ఏపుగా పెరిగికనిపిస్తున్న నల్లరేగడి నేలల్లో మాత్రం అధిక తేమతో పంట ఎదుగుదల కనిపించడం లేదంటున్నారు. నల్లరేగడి నేలల్లోనే పత్తిపంటకు భారీనష్టం వాటిల్లుతుంది. వర్షాలు తగ్గుముఖం పడితేనే పత్తి పంటపై ఆశలు పెట్టుకోవాల్సి ఉంటుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖాధికారులు పర్యటించి పత్తి పంటను ఆశించే చీడపీడలు, పంట ఎదుగుదలపై రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సి ఉంది. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అన్నదాతలు తెలిసిన మందులను పిచికారీచేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• ముంచెత్తిన వరద

భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లోని పంటను వరదలు ముంచెత్తాయి. దీంతో చేతికి వచ్చిన పంట చేజారీ పోయిందంటూ రైతులు ఆవేదనకు గురవుతున్నారు. రోజుల తరబడి వరద నీటిలోనే పంటలు నీట మునగడంతో తెగుళ్ల తీవ్రత కనిపిస్తోంది. ముఖ్యంగా వేరుకుళ్లు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. పత్తితోపాటు కందిపంట ఎండుముఖం పడుతున్నాయి. వరద తగ్గుముఖం పట్టినా పంటను బురద నీరు కప్పేయడంతో నేలపాలైంది. 33శాతం కంటే ఎక్కుగా దెబ్బతిన్న పంటలకే పంట నష్టపరిహారాన్ని చెల్లించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆలోపు పంటలు దెబ్బతింటే ఎరువులు, రసాయన మందులను పిచికారీ చేసి పంటలను కాపాడుకునే అవకాశం ఉందంటున్నారు. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అడుగు మందులు, రసాయన మందులను పిచికారీ చేసే పరిస్థితి లేదంటున్నారు. చాలా ఎకరాలలో బురద మట్టి, ఇసుక మేటలు వేయడంతో పూర్తిగా ఎండిపోయి నేలమట్టమైంది. చీడపీడల ఉధృతిని అరికట్టలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రెండుమాసాలైనా జానడెత్తయిన ఎదిగినట్లు కనిపించడంలేదు. ఎదుగుదశలో పత్తి పంటకు అధిక వర్షాలు తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితులతో ఆశించిన దిగుబడులు రావడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వరదల కారణంగా దెబ్బతిన్న పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసేందుకు అన్నదాతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనుకున్న దిగుబడి రావడం కష్టమే..

• జైతు పటేల్, రైతు, ఝరి, తలమడుగు

ఈ ఏడాది పత్తి పంటకు అనుకూలమైన వాతావరణమే ఉండడంతో పంట ఏపుగా పెరిగింది. కానీ కురుస్తున్న భారీ వర్షాలకు పంట ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. కాత, పూత దశలోనే అధిక వర్షాలు కురవడం ఇబ్బందికరంగా మారింది. రసాయన మందులు పిచికారీ చేసేందుకు కూడా సమయం లేకుండాపోయింది. దీంతో చీడపీడలు ఆశించిపంటను దెబ్బతీస్తున్నాయి. ఇకనైనా వర్షాలు తగ్గితే బాగుంటుంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని పంట ఎరుపుగా మారి ఎదుగుదల నిలిచిపోతుంది. ఇవే పరిస్థితులు మరికొన్నాళ్ల పాటు ఉంటే దిగుబడులపై ప్రభావం పడుతుంది.

నేడే వినాయక చవితి

• సిద్ధమైన మండపాలు • కొలువుదీరనున్న గణనాథులు



కొలువు దీరేందుకు సిద్ధంగా ఉన్న గణనాథులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 6: ప్రజలు ఎంతో ఇష్టంగా పూజించే వినాయకచవితి పండుగను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. నవరాత్రులు ప్రత్యేకపూజలు అందుకోనున్న బొజ్జగణపయ్య కొలువుదీరనున్నాడు. దేశవ్యాప్తంగా జరుపుకోనున్న ఈ పండుగలో భాగంగా జిల్లాలోనూ ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పండుగను జరుపుకోనున్నారు. జిల్లాలో పట్టణ గ్రామ, మండల కేంద్రాలలో ఇప్పటికే వినాయక మండపాలను ప్రత్యేకహంగులతో, విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసి నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధంచేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జిల్లా కేంద్రానికి వచ్చి వినాయక విగ్రహాలను కొనుగోలుచేసి తీసుకెళ్లారు. అంతేకాకుండా జిల్లాకేంద్రంలోనూ భారీవినాయక విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతీ ఏడాది ప్రత్యేక హంగులతోనిర్వహించే కుమార్ జనతా నిర్వహకులు భారీ 50అడుగుల గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. ఇందుకు వివిధ ఆకారాలలో గణనాథుడు రూపుదిద్దుకొని కొలువుదీరనున్నాడు. గణపతి పూజకు సంబంధించిన వివిధ పూజా సామగ్రిని విక్రయించడంతో ఒకరోజు ముందుగానే భక్తులు కొనుగోలు చేసేందుకు బారులుతీరారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు



50 అడుగుల విగ్రహం



ముస్తాబైన మండపాలు

సంక్షిప్త సమాచారం



గుడిహత్నూర్‌లో మూసి ఉన్న దుకాణాలు

గుడిహత్నూర్ బంద్ ప్రశాంతం

గుడిహత్నూర్‌రూరల్, సెప్టెంబరు6: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం ఆదివాసీ సంఘాల ఇచ్చిన పిలుపు మేరకు సంతతోపాటు మార్కెట్‌బంద్ ప్రశాంతంగా ముగిసింది. హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు బంద్ పాటించాయి. నిందితులకు ఉరిశిక్ష విధించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుని ఏజెన్సీ ప్రాంతంలో మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్షరాస్యతపై అవగాహన సదస్సు

భీంపూర్ రూరల్, సెప్టెంబరు6: మండల కేంద్రం రైతు వేదికలో శుక్రవారం మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై భీంపూర్, గుంజల, వడ్గం, రాజ్‌గడ, డబ్బాకూచి, బెల్సరీ రాంపూర్ గ్రామాలకు చెందిన స్వయం సహాయ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయడైరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన్‌రావు, భీంపూర్ డీసీసీబీ బ్యాంకు మేనేజర్ పల్లవి, మహిత స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ మహిథ స్వచ్ఛంద సంస్థ ద్వారా వివిధరకాల సహకార కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సంఘాల అధ్యక్షురాలు అనసూయ, ఐకేపీ ఏపీఎం ప్రసాద్, నాబార్డు కౌన్సిలర్ అశోక్‌రెడ్డి, మహిత ప్రోగ్రాం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పికెట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

• ఎస్పీ గౌస్‌అలం

గుడిహత్నూర్ రూరల్, సెప్టెంబరు6: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గౌస్‌అలం ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను శుక్రవారం ఎస్పీ పరిశీలించారు. మండలంలో పరిస్థితుల గురించి ఎస్సై సయ్యద్ ఇమ్రాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉట్నూర్ వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికి వెళుతున్నాయో జైనూర్‌వైపు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రతీ వాహనాన్ని ఆపి తనిఖీలు చేసి వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

• కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేపడతాం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, సెప్టెంబరు6: భారీవర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ రైతులకు భరోసాఇచ్చారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వరదల్లో కలిగిన నష్టాన్ని ప్రజలు, రైతులను అడిగితెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో కోతకు గురైన రోడ్లను, బ్రిడ్జిలను పరిశీలించారు. భారీ వర్షాలకు పంట పొలాలు దెబ్బతిన్నాయని, రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని హామీనిచ్చారు. కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలను మరమ్మతులు చేసి త్వరలో రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోతకు గురై నరోడ్లను మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. శాశ్వత చర్యలు చేపట్టేలా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.జహార్, నాయకులు ఎం.డి. మసూద్, తోడసం నాగోరావు, వసంత్‌రావు ఉన్నారు.

• మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి..

సిరికొండ రూరల్: మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం సిరికొండ మండల పరిధిలోని లచ్చింపూర్(కే), తిమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ముందుగా లచ్చింపూర్(కే) గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించి, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం వాయిపేట్ గ్రామంవరకు గ్రావెల్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఇమామ్, మాజీ సర్పంచులు కుమ్ర రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరిస్తాం

• ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు6: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ రికగ్నైజేడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో ఎస్టీయూ భవనంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న 70మంది ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు రంగినేని పవన్‌రావ్ అ ధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయలశంకర్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల వృత్తి ఎంతో గొప్పదన్నారు. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఎలాంటి సమస్య వచ్చిన వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. త్వరలోనే ప్రైవేట్‌టీచర్లతో సమావేశం ఏర్పాటు చేసుకొని అర్హులైన వారందరికీ విడుదల వారీగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చేలా కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో డీఈవో టి.ప్రణీత, ఎంఈవో సోమయ్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసుధన్, రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.